సాక్షి ఆదిలాబాద్

శనివారం । 21 । జనవరి । 2023



మహా పూజకు వేళాయె

ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా మహాపూజకు మెస్రం వంశీయులు సిద్ధమయ్యారు. నేటి రాత్రి 10:30 గంటలకు పవిత్ర గంగాజలంతో అభిషేకిస్తారు. 8లో▸



చదువులమ్మకు కోరుకున్న చీర

బాసర శ్రీ జ్ఞానసరస్వతీ అమ్మవారికి వసంత పంచమి పురస్కరించుకుని పద్మశాలి సంఘం తరపున ప్రత్యేకంగా చేనేత చీర సిద్ధమవుతోంది. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 /19.0

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతంతో పాటు రాత్రి వేళలో చలితీవ్రత కొంతమేర తగ్గనుంది.

న్యూస్‌రీల్

3న జెడ్పీ సమావేశం

కైలాస్‌నగర్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 3న స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు సీఈఓ బి.గణపతి ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ

కైలాస్‌నగర్: జిల్లా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లకు స్థానచలనం కల్పిస్తూ కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ అర్బన్ మండల డీటీగా పనిచేస్తున్న పి.ప్రవీణ్‌కుమార్‌ను మావల మండలానికి, అక్కడ పనిచేస్తున్న ఐ.సుజాతను జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయ డీటీగా బదిలీ చేశారు. పౌర సరఫరాల శాఖ డీటీగా పనిచేస్తున్న బి.మహేశ్‌ను ఆదిలాబాద్ అర్బన్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించారు. వీరు త్వరలోనే ఆయా స్థానాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

దివ్యాంగులకు రైల్వే పాస్‌లు పంపిణీ



రైల్వే పాస్‌లు అందజేస్తున్న డైరెక్టర్ జైసింగ్

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లాలోని దివ్యాంగులకు రైల్వే పాస్‌లు జారీ అయ్యాయి. ఈమేరకు రిమ్స్ ఆసుపత్రిలో డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో 200 మందికి వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సలీం, ఉపాధ్యక్షుడు సతీశ్, అమానుల్లా ఖాన్, నందు, రాకేశ్, రాజశేఖర్, సునీల్, సుకుమార్, సురేష్, లక్ష్మారెడ్డి లచ్చన్న, నగేశ్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ ఆధ్వర్యంలో గ్రూప్–1 మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ప్రిలిమ్స్‌లో ఎంపికైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభ్యర్థులకు మెయిన్స్‌కు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు కుల, ఆదాయ, ధ్రువపత్రాలతో పాటు ఆధార్, స్టడీ సర్టిఫికెట్లు, గ్రూప్–1 ప్రిలిమ్స్ హాల్‌టికెట్, రెండు ఫొటోలతో ఈనెల 24 వరకు ఆదిలాబాద్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వంద మందికి అవకాశం ఉంటుందని, ఈనెల 25 నుంచి శిక్షణ ప్రారంభం కానున్నట్లు తెలిపారు. శిక్షణ మూడు నెలల పాటు ఉంటుందని, ప్రతినెలా రూ.5వేల స్టైఫండ్‌తో పాటు ఉచితంగా మెటీరియల్ అందిస్తామని తెలిపారు. వివరాలకు 08732–221280 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఏఈఈ అభ్యర్థుల సౌకర్యార్థం స్పెషల్ బస్సు

ఆదిలాబాద్: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎంట్రెన్స్ పరీక్ష నేపథ్యంలో అభ్యర్థుల సౌకర్యార్థం ఈనెల 22న ఆదిలాబాద్ నుంచి నిజామాబాద్‌కు ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు www. tsrtconline. in వెబ్‌సైట్ ద్వారా, అలాగే ఆదిలాబాద్ బస్‌స్టేషన్‌లో ఆన్‌లైన్ రిజర్వేషన్ కౌంటర్‌లో ముందస్తు రిజర్వేషన్ అవకాశాన్ని కల్పించామని తెలిపారు. పరీక్ష కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే అభ్యర్థులు 99592 26002, 73828 40334 నంబర్లలో సంప్రదిస్తే ప్రత్యేక బస్సుల ఏర్పాటును పరిశీలిస్తామని తెలిపారు.

విద్యాశాఖలో అక్రమార్కుడు!



కొలువులు ఇప్పిస్తానంటూ ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ఇద్దరి నుంచి రూ.20వేల చొప్పున, మరో మహిళ నుంచి రూ.30వేలు వసూలు చేశాడు విద్యాశాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి. డీఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉందని, అది భర్తీ అయ్యేవరకు కాంట్రాక్ట్ పద్ధతిన పని చేయవచ్చని నమ్మబలికాడు ఈ 'జూనియర్' స్థాయి ఉద్యోగి. అలాగే మరో వ్యక్తికి కంప్యూటర్ ఆపరేటర్ ఇప్పిస్తానని, కేజీబీవీలో క్రాఫ్ట్ టీచర్ కొలువు ఇప్పిస్తానని మహిళ నుంచి డబ్బులు తీసుకున్నాడు. వీటిని తన కారు డ్రైవర్ అకౌంట్‌లో ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా జమ చేయించుకున్నాడు. కాగా, బాధితులు ముందుగా ఉద్యోగాల కోసం ఐకేపీలో పనిచేసే ఓ ఉద్యోగిని కలవగా, సదరు వ్యక్తి డీఈవో కార్యాలయంలో పనిచేసే ఈ అక్రమార్కుడిని పరిచయం చేయించడం గమనార్హం.


- కొలువుల పేరిట 'జూనియర్' టోకరా
- పలువురి నుంచి వసూళ్లు
- విషయం బయటకు పొక్కడంతో విధులకు ఎగనామం
- పట్టించుకోని అధికారులు
- లబోదిబోమంటున్న బాధితులు

ఆదిలాబాద్‌టౌన్: మోసపోయేవారు ఉంటే.. మోసాలకు పాల్పడేవారు రెచ్చిపోతూనే ఉంటారనే దానికి నిదర్శనంగా నిలుస్తోంది విద్యాశాఖ కార్యాలయంలోని ఓ ఉద్యోగి బాగోతం. తెరవెనుక మరికొంత మంది ఉన్నప్పటికీ ప్రధాన సూత్రధారిగా ఈయనే ఉన్నట్లు తెలుస్తోంది. సర్కారు కొలువు ఉన్నా కాసులకు కక్కుర్తిపడి అడ్డదారులు తొక్కుతున్నాడు. ఉద్యోగాల ఆశచూపి నిరుద్యోగులను నమ్మిస్తూ అందినకాడికి దండుకుంటున్నాడు. అంతేకాకుండా పనిచేస్తున్న కార్యాలయంలోనూ అక్రమాలకు తెరలేపుతున్నాడు. ఈ విషయంపై పలువురు ఆ శాఖ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేయడంతో ఆయనను తప్పించారు. ఆయన స్థానంలో మరో ఉద్యోగికి విధులు కేటాయించారు. ఈ క్రమంలోనే ఆయన బాగోతాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి.

20 రోజుల నుంచి విధులకు డుమ్మా..

విద్యాశాఖలో ఆయన కింది స్థాయి 'జూనియర్' ఉద్యోగి. గతంలో ఆయన చూస్తున్న సెక్షన్‌లో డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై చర్యలకు పూనుకున్నారు. అయితే ఆ సెక్షన్‌ను కేటాయించిన వారికి ఆయన చార్జ్ ఇవ్వకుండానే 20 రోజులుగా విధులకు ఎగనామం పెట్టాడు. దీంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి. దరఖాస్తు చేసుకున్న బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఉపాధ్యాయులు లబోదిబోమంటున్నారు. ఇదిలా ఉండగా ఆయన ఆఫీస్‌కు రాకపోవడంతో ఉద్యోగాల కోసం డబ్బులు ఇచ్చిన వారు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఆయన గురించి ఆరా తీస్తున్నారు. అయితే ఆ శాఖ ఉద్యోగులు తమకేమి తెలియదంటూ దాటవేస్తున్నారు. సదరు ఉద్యోగి ఫోన్ సైతం స్విచాఫ్ ఉండడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. అయితే ఆయన కోసం కార్యాలయానికి ఎవరెవరు వస్తున్నారు.. ఆఫీస్‌లో ఏం జరుగుతుందనే విషయాలు సదరు ఉద్యోగికి ఇట్టే తెలిసిపోతుండడం గమనార్హం. ఉన్న రెండు నంబర్లు స్విచాఫ్ ఉండగా, ఇక్కడ జరుగుతున్న వ్యవహారాలు ఆయన వద్దకు ఎలా చేరుతున్నాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో మరికొందరి పాత్ర ఉండవచ్చనే అనుమానాలు వినిపిస్తున్నాయి.

డ్రైవర్ అకౌంట్ ద్వారా డబ్బులు..


Transaction • Change category

Dear SBI User, your A/c X2847-debited by Rs20000.0 on 16Jun22 transfer to [illegible] No 216702008058. If not done by u, fwd this SMS to

డ్రైవర్‌కు సంబంధించిన ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేసిన స్క్రీన్‌షాట్

నిరుద్యోగుల నుంచి నేరుగా డబ్బులు తీసుకోకుండా తనవద్ద పనిచేసే డ్రైవర్ అకౌంట్‌లో గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా డబ్బులు జమ చేయించుకుంటున్నాడు ఈ ఉద్యోగి. అయితే సదరు డ్రైవర్‌ను డబ్బులు అడిగితే 'తాను డబ్బులు వేయమని చెప్పలేదని, ఎవరు చెప్పారో వారి వద్ద నుంచే వసూలు చేసుకోవాలని' సమాధానం ఇస్తుండడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు.

మరికొందరు బాధితులు..

- ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి ఓ దివ్యాంగుడి నుంచి రూ.70వేలు వసూలు చేశాడు.
- మహిళకు కేజీబీవీలో కాంట్రాక్ట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.20వేలు తీసుకున్నాడు.
- పదో తరగతి మెమోలో మార్పులు చేర్పులు చేయిస్తానని ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.50వేలు వసూలు చేశాడు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మంది బాధితులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కొంతమంది డీఈవోను కలవడంతో ఈ వ్యవహారం బయటపడింది. సెక్షన్‌లోని పలువురు ఉద్యోగులు వచ్చేవారికి సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్నారు. కొంతమంది వన్‌టౌన్‌లో సైతం ఆయనపై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

నా దృష్టికి రాలేదు

కార్యాలయంలో పనిచేసే ఆ ఉద్యోగి ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసినట్లు నాకు ఇప్పటివరకు ఎవరూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయలేదు. కొంతమంది వస్తున్నప్పటికీ మౌఖికంగా డబ్బులు ఇవ్వాల్సి ఉందని చెబుతున్నారు. 15 రోజులుగా సదరు ఉద్యోగి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరవుతున్నాడు. విచారణ జరిపి చర్యలు చేపడుతాం.

– ప్రణీత, డీఈవో

సీసీఐని సందర్శించిన త్రీమెన్ కమిటీ



సీసీఐ జీఎం నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

- లీజు భూముల వివరాలపై ఆరా

సాక్షి ఎఫెక్ట్

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కు సంబంధించిన లీజు స్థలాలు, లైమ్‌స్టోన్ అన్యాక్రాంతమవుతున్న వైనాన్ని వివరిస్తూ ఈ నెల 18, 19 తేదీల్లో 'భూం ఫట్', 'సీసీఐ ఆస్తులు స్వాహా..' శీర్షికలతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలకు స్పందన లభించింది. ఈక్రమంలో రంగారెడ్డి జిల్లా తాండూర్ సీసీఐ పరిశ్రమకు చెందిన ముగ్గురు అధికారులతో కూడిన బృందం శుక్రవారం స్థానిక సిమెంట్ పరిశ్రమను సందర్శించింది. ఫ్యాక్టరీకి చేరుకున్న సదరు సభ్యులు అందులోని వివిధ విభాగాలు, ఆవరణను పరిశీలించారు. అనంతరం జీఎం చాంబర్‌లో సీసీఐ ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జి ఆర్‌కే.గుప్తాతో సమావేశమయ్యారు. ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీకి సంబంధించిన లీజు భూములు, వాటి లీజు గడువు, అవి పరాధీనమవుతున్న తీరుపై ఆరా తీసినట్లుగా తెలిసింది. వాటికి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించడంతో పాటు వాటిపై వివరాలను అడిగి తెలుసుకున్నట్లుగా సమాచారం. అనంతరం ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డిని కలిసి సీసీఐ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విన్నవించినట్లుగా తెలిసింది.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



సీసీఐ భూములను పరిశీలిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: సీసీఐ లీజు భూముల్లో వెలుస్తున్న అక్రమ వెంచర్లను సీసీఐ సాధన కమిటీ శుక్రవారం సందర్శించింది. ఆ ప్రాంతంలో కొనసాగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కన్వీనర్ దర్శనాల మల్లేశ్, కో కన్వీనర్లు విజ్జగిరి నారాయణ, కొండా రమేశ్, ఏ.అరవింద్ మాట్లాడారు. సీసీఐ లీజు భూముల్లో కొందరు రియల్టర్లు వెంచర్లు వేస్తూ, భూములను కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే భూమి అభివృద్ధి కోసం సీసీఐ లైమ్‌స్టోన్స్ ఎర్ర మట్టిని వాడుకుంటున్నారన్నారు. వీరికి సీసీఐ మేనేజర్ అన్ని విధాలా సహకరిస్తున్నారని ఆరోపించారు. లైమ్‌స్టోన్స్, మట్టిని రియల్టర్లకు మేనేజర్ అమ్ముకుంటున్నాడని, ఆయనపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్తిని కాజేస్తున్న వారిపై కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మేనేజర్, రియల్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్, ఎస్పీలను శనివారం కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు లోకారి పోశెట్టి, బండి దత్తాత్రి, మునిగెల నర్సింగ్, అరుణ్‌కుమార్, జగన్‌సింగ్, బుట్టి శివకుమార్, అబ్దుల్, జి.నగేష్, రఫీక్, ఈశ్వర్ దాస్, బొజ్జ ఆశన్న, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతకు దారి తీసిన నిరసన

- బీజేవైఎం నాయకుల అరెస్ట్



నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఆదిలాబాద్: స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం మాట్లాడారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా పోలీసులు, నాయకుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, సురేందర్, రాకేష్ తదితరులున్నారు.

గురువులు నిత్య విద్యార్థులు

- ఎమ్మెల్యే జోగు రామన్న
- 'టీఎల్‌ఎం' మేళా ప్రారంభం



ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న, కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: గురువులు నిత్య విద్యార్థులని, కొత్త విషయాలను నేర్చుకొని ప్రతిరోజు విద్యార్థులకు బోధన చేయాలని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని గెజిటెడ్ నం.1 పాఠశాలలో జిల్లా స్థాయి బోధనోపకరణాల మేళా (టీఎల్‌ఎం) శుక్రవారం నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభకనబర్చిన ఉపాధ్యాయులు ఇందులో టీఎల్‌ఎంను ప్రదర్శించారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. బోధనోపకరణాలతో విద్యాబోధన చేస్తే విద్యార్థులకు సులువుగా అర్థమవుతుందని తెలిపారు. ఈ మేళాకు 18 మండలాల నుంచి 400 ప్రదర్శనలు వచ్చాయని, ఇందులో రాష్ట్రస్థాయికి సబ్జెక్టు నుంచి రెండు చొప్పున పదింటిని ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం టీటీయూ సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీఈవో ప్రణీత, ఎంఈవో జయశీల, విద్యాశాఖ ఏడీ నర్సింలు, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్ శ్రీనివాస్, సెక్టోరల్ అధికారులు నర్సయ్య, సుజాత్ ఖాన్, నారాయణ, ఎంఈవోలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కైలాస్‌నగర్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం రోడ్డు భద్రత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జాతీయ, అంతర్రాష్ట్ర, గ్రామీణ రహదారులపై తరచూ చోటు చేసుకునే ప్రమాద స్థలాలను గుర్తించాలన్నారు. ప్రమాదాల నివారణకు రహదారులు, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, పోలీస్, రవాణశాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో భోరజ్, మేకల గండి, సీతాగొంది, కుప్టి బ్రిడ్జి, ఉట్నూర్ మండలం పులిమడుగు, తదితర ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. వాటిని నియంత్రించే విధంగా సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని బ్రిడ్జీల వద్ద సూచికలు లేనందున రాత్రి వేళలోవాహనదారులకు ఇబ్బంది ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్ జాతీయ రహదారి గుండా వచ్చే వాహనాలు న్యూట్రల్‌లో రావడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, సాంకేతిక పరంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. భోరజ్ చెక్ పోస్ట్ వద్ద వాహనాలు సర్వీస్ రోడ్లపై నిలపడం ద్వారా వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సంబంధిత శాఖల అధికారుల సహకారంతో ప్రమాదాలు అరికట్టేందుకు సహకరిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ట్రెయినీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీటీసీ పుప్పాల శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య, పంచాయతీరాజ్ ఈఈ మహావీర్, మున్సిపల్ కమిషనర్ శైలజ, ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి, ఆర్‌అండ్‌బీ, పోలీస్, రవాణ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

జిల్లాలో నేరాలు, ప్రమాదాలను ఎప్పటికప్పుడు పరిశీలించి తెలుసుకునేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. పట్టణంలో ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, మరిన్ని చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉందని ఎస్పీ కలెక్టర్‌కు వివరించారు. కంట్రోల్ రూమ్ పనితీరును సంబంధిత సాంకేతిక సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు.

కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కటిక సంఘ భవనంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. జిల్లాలోని 33 కేంద్రాల్లో కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. సెలవు మినహా మిగతా రోజుల్లో ఈ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంపై మరింత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి రీడింగ్ గ్లాస్‌లు, మందులు అందించనున్నట్లు తెలిపారు. ఆమె వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన తదితరులున్నారు.

పరీక్షలు చేయించుకునేలా సహకరించాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి, అంకాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం సందర్శించారు. సిబ్బంది పని తీరును పరిశీలించారు.ఆమె వెంట మండల వైద్యాధికారి రాహుల్, వైద్య సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

కైలాస్‌నగర్: కొలాం, తోటి గిరిజనుల స్థితిగతుల అధ్యయనం, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు వంటి తదితర అంశాలను పరిశీలించేందుకు కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖాధికారుల బృందం శుక్రవారం జిల్లాలో పర్యటించింది. జిల్లాలోని రామడుగు, ధర్మిజిపేట, కామాయిపేట కొలాం గ్రామాలు, పునగూడ, వాఘపూర్, దివ్యగూడ తోటి గ్రామాలను సందర్శించారు. అక్కడి గిరిజన కొలాం, తోటి కులస్తుల స్థితిగతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. వారి సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రగతిపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వారి పర్యటనకు సంబంధించిన అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. గిరిజన మంత్రిత్వ కొలాం కమ్యూనిటీ అండర్ సెక్రెటరీ కె.చంద్రశేఖర్, అస్సాం ట్రైబ్ తోటి కమ్యూనిటీ డిప్యూటీ మేనేజర్ పామ్‌థింగ్ క్రిషింగ్, గిరిజన సంక్షేమ శాఖ టీఆర్ఐ జాయింట్ డైరెక్టర్ సముజ్వల, అసిస్టెంట్ మ్యూజియం క్యూరేటర్ శైలజ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. వారివెంట ఐటీడీఏ పరిపాలనాధికారి రాంబాబు, ఏపీఓ భాస్కర్ తదితరులు ఉన్నారు.

పీఎస్ఈ విచారణ వేగవంతం చేయాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

కైలాస్‌నగర్: పక్షం రోజుల్లో ఓటరు జాబితాలో ఉన్న పీఎస్ఈ ఎంట్రీలు వందశాతం ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో జాతీయ ఓటర్ దినోత్సవం, పీఎస్ఈ ఎంట్రీ ధ్రువీకరణ, ఓటర్ ఎపిక్ కార్డుల జారీ, ఓటర్‌ఐడీతో ఆధార్ అనుసంధాన ప్రక్రియపై శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవంను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రతీజిల్లాలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన పాటను మైక్‌ల ద్వారా వినిపించిన అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించాలన్నారు. 80ఏళ్లు పైబడిన ఓటర్లు, నూతన ఓటర్లను సన్మానించాలని సూచించారు. అలాగే అర్హులందరూ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించేలా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ లింకేజ్ అనుసంధానం ప్రశంసనీయంగా ఉందని, పట్టణ ప్రాంతాల్లో దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ, జిల్లాలో 77 శాతం ఆధార్ లింకేజీ పూర్తయిందన్నారు. రానున్న రోజుల్లో బూత్‌స్థాయి అధికారుల వారీగా ప్రణాళికలు రూపొందించి పురోగతి సాధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ట్రెయినీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవో రమేశ్ రాథోడ్, స్వీప్ నోడల్ అధికారి లక్ష్మణ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, నాయబ్‌తహసీల్దార్లు శ్రీవాణి, ప్రవీణ్, సాంకేతిక సహాయకులు ఉమాకాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సిరికొండ: మండలంలోని రాయిగూడ గ్రామానికి చెందిన ఆత్రం గోవింద్‌రావు(28)కు ఐదు నెలల క్రితం బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి సోకింది. దీంతో బంధువులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందాడు. సదరు యువకుడు ఐకేపీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. దీంతో రాష్ట్ర ఐకేపీ సంఘం ఆధ్వర్యంలో రూ.లక్షా 80వేలు అందచేసింది.

అమ్మవారి సన్నిధిలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ



పూజలు చేస్తున్న అరవింద్‌కుమార్

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, సమాచార శాఖ కమిషనర్ అరవింద్‌కుమార్ దర్శించుకున్నారు. శుక్రవారం బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, అదనపు కలెక్టర్ హేమంత్ బొర్కాడేతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



గణేశ్ (ఫైల్)

కడెం: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని నర్సాపూర్ గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని మొర్రిగూడెం గ్రామానికి చెందిన మొకిరాల గణేశ్ (36) ఖానాపూర్ నుంచి కడెం వైపు బైక్‌పై వెళ్తున్నాడు. నర్సాపూర్ గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

బోగస్ పత్రాలు తయారు చేసిన వారిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తిర్పెల్లికి చెందిన జోగు నడిపి గంగన్న, అతడి భార్య జోగు నర్సమ్మ పేరిట 1969 మార్చి 4న పట్టణానికి చెందిన తిర్మాజి కిష్టన్న వద్ద నుంచి 5.20 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమి విక్రయించిన తిర్మాజి కిష్టన్న బంధువులు ఎస్.విలాస్, రమేష్, పొచ్చన్న, స్వరూపిణి, గంగమ్మ, దేవమ్మలు కొనుగోలుదారు అయిన జోగు నర్సమ్మ తమకు గిఫ్ట్‌గా ఇచ్చినట్లు నకిలీ పత్రాలతో రికార్డు తయారు చేశారు. దీంతో నర్సమ్మ కుమారుడు జోగు పోతన్న కోర్టుకు వెళ్లాడు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై విష్ణు ప్రకాష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం

నేరడిగొండ: మండలంలోని చించోలి ప్రకృతి వనంలో వాటర్ ట్రాక్టర్ బోల్తాపడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. లఖంపూర్(జి) గ్రామపంచాయతీ పరిధిలోని చించోలి గ్రామంలోని ప్రకృతి వనంలో ప్రతిరోజు ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీరు అందిస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

మహాపూజకు వేళాయె



నాగోబా విగ్రహం



ముస్తాబైన నాగోబా ఆలయం

- నేడు నాగోబాకు గంగాజలాభిషేకం
- ఏర్పాట్లు చేసిన మెస్రం వంశీయులు
- మహాపూజ అనంతరం జాతర ప్రారంభం
- ఈ నెల 22న కేంద్రమంత్రి అర్జున్ ముండా రాక
- 24న దర్బార్.. హాజరుకానున్న మంత్రులు సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్ రెడ్డి

జాతర ఏర్పాట్లు పూర్తి

నాగోబా జాతరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నాగోబాను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు, మెస్రం వంశీయుల సౌకర్యార్థం ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో కేస్లాపూర్ నుంచి నాగోబా ఆలయం వరకు బారీకేడ్లు ఏర్పాటు చేశారు.



ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాల్స్

ఇంద్రవెల్లి(ఖానాపూర్): రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన, ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా మహాపూజకు మెస్రం వంశీయులు సిద్ధమయ్యారు. ఈసారి తమ సొంత నిధులతో నిర్మించుకున్న నాగోబా ఆలయంలో మహాపూజ చేయనున్నారు. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని శనివారం రాత్రి 10:30 గంటలకు పవిత్ర గంగాజలంతో నాగోబాకు అభిషేకిస్తారు. మహాపూజ అనంతరం ప్రారంభం కానున్న జాతర ఈ నెల 28 వరకు కొనసాగనుంది. నాగోబాను దర్శించుకోవడానికి ఈ నెల 22న కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, 24న నాగోబా దర్బార్ సమావేశానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, దేవదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరుకానున్నారు.

మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గోదావరి హస్తినమడుగు నుంచి సేకరించిన గంగాజలంతో వచ్చి మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు శనివారం ఉదయం కేస్లాపూర్‌లోని నాగోబా మురాడి వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం నాగోబా ప్రతిమలు, పూజాసామగ్రితో డోలు, పెప్రే, కాళికోమ్ వాయిద్యాలతో శోభాయాత్రగా నాగోబా ఆలయానికి వెళ్లి సంప్రదాయ పూజలు చేస్తారు. మహాపూజకోసం తీసుకువచ్చిన మట్టి కుండల ను 22 కితల మెస్రం వంశం మహిళలకు అంది స్తారు. వారు మెస్రం వంశం పెద్దల ఆశీర్వాదం తీసుకుని మర్రిచెట్టు వద్దగల కోనేరు నుంచి కుండల్లో నీటిని తీసుకువస్తారు. మెస్రం వంశ అల్లుళ్లు నాగోబా ఆలయం పక్కనే ఉన్న పాత పుట్టను తొలగించడంతో మెస్రం వంశ మహిళలు, ఆడపడుచులు కొత్త పుట్టలు తయారు చేస్తారు. అందులో నుంచి కొంతమట్టిని ఉండల్లా చేసి సతీదేవత ఆలయంలో ఏడువరుసల్లో బౌలను తయారు చేస్తారు. ఈ పూజ శనివారం సాయంత్రం వరకు కొనసాగుతుంది. అనంతరం మెస్రం వంశీయులు ఆలయం పక్కనే ఉన్న ప్రత్యేక కట్టడమైన గోవడ్ వద్దకు చేరి కితల వారీగా బస చేస్తారు. అక్కడి నుంచే నాగోబా మహాపూజ, సంప్రదాయ పూజలు చేస్తారు.

పెర్సపేన్, బాన్‌దేవతకు పూజలు

నాగోబా మహాపూజల అనంతరం మెస్రం వంశీయులు ఆదివారం నాగోబా ఆలయం వెనుక ఉన్న పెర్సపేన్(పెద్ద దేవుడు)కు పూజలు చేసి నైవేద్యం సమర్పిస్తారు. అదే సమయంలో పక్కనే మెస్రం వంశ మహిళలు, భేటింగ్ అయిన కొత్త కోడళ్లు బాన్ దేవతలను తొలగించి కోనేరు బావి నుంచి తీసుకువచ్చిన నీటితో కొత్త బాన్ దేవతలను తయారు చేసి నైవేద్యం సమర్పిస్తారు.

450 మంది పోలీసులతో బందోబస్తు

నాగోబా జాతరకు ముగ్గురు డీఎస్పీలు, ఏడుగురు సీఐలు, 28 మంది ఎస్సైలతో పాటు మొత్తం 450 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఉట్నూర్ సీఐ సైదరావ్ తెలిపారు. జాతరలో 100కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కొత్త కోడళ్లతో భేటింగ్

మహాపూజ అనంతరం మెస్రం వంశీయులు రాత్రి ఒంటిగంట తర్వాతర గోవడ్ నుంచి సంప్రదాయ వాయిద్యాలతో నాగోబా ఆలయానికి చేరుకుని భేటింగ్ (నాగోబా దేవత పరిచయం) పూజలు ప్రారంభిస్తారు. ఇప్పటి వరకూ నాగోబా సన్నిధికి రాని మెస్రం వంశ కోడల్లు, కొత్తగా వివాహమైన మహిళలు తెల్లని దుస్తులు ధరించి భేటింగ్‌లో పాల్గొంటారు. సతీదేవత ఆలయంతో ప్రత్యేక పూజలు చేసి మెస్రం వంశం పెద్దల ఆశీర్వాదం తీసుకుంటారు. దీంతో పూర్తిగా మెస్రం వంశంలో చేరినట్లుగా భావిస్తారు. ఈ కార్యక్రమం ఆదివారం తెల్ల వారుజాము వరకూ కొనసాగుతుంది.

22న కేంద్రమంత్రి అర్జున్‌ముండా రాక



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: నాగోబాను దర్శించుకోవడానికి ఈ నెల 22న కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా జిల్లాకు రానున్నట్లు ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పర్యటన వివరాలు వెల్లడించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ జీవి రమణ, నాయకులు రాళ్ల బండి మహేందర్, గటిక క్రాంతి కుమార్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటన షెడ్యూల్

ఉదయం 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు. 9:30 వరకు బ్రేక్ ఫాస్ట్ అనంతరం హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్ ద్వారా 10.10 గంటలకు కేస్లాపూర్ చేరుకుంటారు. 11:00 గంటల వరకు నాగోబా ఆలయంలో మెస్రం వంశస్తులతో కలిసి మహాపూజలో పాల్గొంటారు. 11:30 గంటలకు మెస్రం వంశీయులతో టీ బ్రేక్ అనంతరం ఒంటిగంట వరకు పబ్లిక్ మీటింగ్, 2 గంటలకు ఆదివాసీలతో లంచ్ అనంతరం 2:40 గంటలకు హైదరాబాద్, 5 గంటలకు ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు.

జాతరకు ప్రత్యేక బస్సులు

- ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి

ఆదిలాబాద్: కేస్లాపూర్ నాగోబా జాతరను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఈ నెల 21 నుంచి 28 వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా ఆదిలాబాద్, ఉట్నూర్, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోల నుంచి ఉట్నూర్ వైపు వెళ్లే అన్ని బస్సులు కేస్లాపూర్ మీదుగా వెళ్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తృటిలో తప్పిన ప్రాణాపాయం

- పంట పొలంలో 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి ఘటన

సారంగపూర్: మండలంలోని ధని గ్రామానికి చెందిన కుర్మె పెద్దసాయన్న(46) మొక్కజొన్న పంటచేనులో శుక్రవారం మంచె నిర్మించే క్రమంలో 11కేవీ విద్యుత్ తీగలు తగిలి ప్రాణాపాయ స్థితి నుంచి భయటపడ్డాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... తన మొక్కజొన్న పంటను అడవి జంతువుల నుంచి రక్షించుకునేందుకు కాపలా కాయడానికి వీలుగా మంచె నిర్మించుకుంటున్నాడు. మంచెపై రేకులు వేస్తుండగా ఓ రేకు 11కేవీ విద్యుత్ లైన్‌కు తగిలి విద్యుత్ షాక్‌కు తగిలి మంచెపై నుంచి కిందపడిపోయాడు. దీంతో తలకు గాయాలయ్యాలు కాగా బంధువులు నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది. అయితే గతంలో మూడుసార్లు విద్యుత్ లైన్ కిందివైపు ఉందని అదనపు విద్యుత్ స్తంభం వేయించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధిత రైతు వాపోయాడు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య



రాజన్న (ఫైల్)

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన ఎడగొట్టు రాజన్న(70) అనారోగ్యంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రూరల్ ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... రాజన్న కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్న తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గాలించగా పట్టణ శివారులోని గండి రామన్న అడవిలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుటుంబం

జైనథ్: మండలంలోని డొల్లార గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెండల్‌వాడ గ్రామానికి చెందిన ఓ కుటుంబం గాయాలపాలైంది. పోలీసుల కథనం ప్రకారం... గంగారం భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి బైక్‌పై మహారాష్ట్ర వైపు వెళ్తున్నాడు. కామాయి పెట్రోల్ బంక్ దాటిన తరువాత అటుగా వెళ్తున్న లారీని వెనకవైపు నుంచి బైక్‌తో ఢీకొన్నాడు. గమనించిన స్థానికులు 108లో రిమ్స్‌కి తరలించారు. గంగారాంకు తీవ్రంగా గాయాలు కాగా మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పెర్సిస్ బిట్ల తెలిపారు.



సందడిగా సదల్‌పూర్ జాతర

బేల: మండలంలోని సదల్‌పూర్ గ్రామ శివారులోని బైరందేవ్, మహాదేవ్ ఆలయాల పరిసరాల్లో కొనసాగుతున్న జంగీ జాతరకు శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ రెండు ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో రంగుల రాట్నాలు, ఇతర ఆట వస్తువులతో సందడిగా మారింది.



జాతరలో సందడి

విద్యుత్ అధికారుల నిర్బంధం

- ఖాప్రిలో వినియోగదారుల ఆగ్రహం
- వేలల్లో ఏసీడీ చార్జీలు కట్టలేమని ఆందోళన

జైనథ్: మండలంలోని ఖాప్రి గ్రామానికి చెందిన విద్యుత్ వినియోగదారులు ఏసీడీ చార్జీలు (అడ్వాన్స్ కంసంప్షన్ డిమాండ్) చార్జీలకు నిరసనగా ఆందోళన చేపట్టారు. శుక్రవారం కరెంట్ బిల్ వసూళ్ల కోసం వచ్చిన విద్యుత్ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. కరెంట్ బిల్లు వందల్లో ఉంటే, ఏసీడీ చార్జీలు వేలల్లో ఉన్నాయని వాపోయారు. ముందస్తు సమాచారం లేకుండా సెక్యూరిటీ డిపాజిట్ల పేరిట నిరుపేద గ్రామీణ వినియోగదారులను వేధించడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కరెంట్ బిల్లులతో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో 320కిపైగా మీటర్లు ఉండగా, ప్రతీ ఒక్కరికి వేలల్లో ఏసీడీ చార్జీలు వేశారని తెలిపారు. వెంటనే ఈ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



నిర్బంధంలో విద్యుత్ అధికారులు

అధికారుల నిర్బంధం

జేఎల్ఎం రమేష్ ఇతర సిబ్బందితో కలిసి ముందుగా గ్రామానికి వచ్చి, ఇంటింటికి తిరుగుతూ బిల్లులు వసూలు చేస్తుండగా గ్రామస్తులు బిల్లులు చెల్లించలేమని చెప్పుకొచ్చారు. ఒకేసారి వేలల్లో చార్జీలు చెల్లించలేమని చెప్పారు. చార్జీలు తప్పనిసరిగా చెల్లించాలని లేని పక్షంలో విద్యుత్ సరఫరా నిలిపివేసే పరిస్థితి వస్తుందని అధికారులు తెలిపారు. ఏసీడీ చార్జీలు కేవలం సెక్యూరిటీ డిపాజిట్‌గా మాత్రమే తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఉన్నత అధికారులు వచ్చి తమ సమస్యను తీర్చే వరకు గ్రామం విడిచి వెళ్లరాదని జేఎల్ఎం, ఇతర సిబ్బందిని గ్రామ పంచాయతీలో స్థానికులు నిర్బంధించారు. అనంతరం ఏఈ నగేష్ గ్రామానికి చేరుకోగా అతడిని సైతం నిర్బంధించారు. గ్రామస్తుల సమస్యను ఉన్నత అధికారులకు విన్నవిస్తామని ఏఈ నగేష్ భరోసా కల్పించడంతో గ్రామస్తులు వదిలేశారు.



జీపీ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

గ్రామస్తులపై కేసు

జైనథ్: విద్యుత్ ఏఈ నగేష్, ఇతర సిబ్బందిని గ్రామ పంచాయతీలో నిర్బంధించినందుకు ఖాప్రి గ్రామానికి చెందిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పెర్సిస్ బిట్ల తెలిపారు. ఏవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.



ఇదేమి తీరు!

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని భావి పౌరులుగా తీర్చిదిద్ది దేశాభివృద్ధికి పాటుపడాల్సిన విద్యాశాఖ అధికారులే పొరపాట్లు చేయడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా కేంద్రంలోని స్థానిక గెజిటెడ్ నంబర్ వన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయి టీఎల్ఎమ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో పొరపాటు ఉండడం గమనార్హం. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అనే పదంలో 'ఎస్‌సీహెచ్ఓఓఎల్'కు బదులు 'ఎస్‌హెచ్‌సీఓఓఎల్' అని రాయించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఏర్పాట్లు పరిశీలించిన ఐటీడీఏ పీవో

ఇంద్రవెల్లి: నాగోబా జాతర నిర్వహణలో భాగంగా భక్తులకు, మెస్రం వంశీయుల కోసం చేసిన ఏర్పాట్లను శుక్రవారం రాత్రి ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి పరిశీలించారు. శాఖల వారీగా పూర్తయిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని మెస్రం వంశీయులకు తెలిపాడు. ఏర్పాట్లపై నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు.

దేశీదారు విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

భైంసాటౌన్: దేశీదారు విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భైంసా ఎక్సైజ్ శాఖ సీఐ నజీర్‌హుస్సేన్ శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై సుందల్‌సింగ్ ఆధ్వర్యంలో భైంసాలోని పాండ్రిగల్లిలో సోదాలు నిర్వహించగా ఎండీ అమీర్, ఎండీ ముజమ్మిల్ ఇంటి ఎదుట మహారాష్ట్రకు చెందిన 96 దేశీదారు మద్యం బాటిళ్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సైలు రమేశ్‌కుమార్, ఎం.ప్రణీత్‌గౌడ్, హెడ్‌కానిస్టేబుళ్లు అశోక్, రాజేశ్వర్, కృష్ణమూర్తి, కానిస్టేబుళ్లు సంతోష్, శైలేష్, రవీందర్ ఉన్నారు.

కుల బహిష్కరణకు కారకుడైన వ్యక్తికి జైలు

ఆదిలాబాద్‌టౌన్: కుల బహిష్కరణకు కారణమైన ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం తెజిగూడకు చెందిన గ్రామ పటేల్ రాంచందర్‌కు మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ పీసీఆర్ కోర్టు జడ్జి యశ్వంత్‌సింగ్ చౌహాన్ తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి ఈశ్వర్‌సింగ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన సంతోష్ కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో మాల కులానికి చెందిన వ్యక్తి మరుగుదొడ్డి నిర్మాణం చేస్తుండగా, ఆయన దగ్గరకు పనికి వెళ్లాడు. దీంతో గ్రామ పటేల్ రాంచందర్ తక్కువ కులానికి చెందిన వ్యక్తి వద్ద పనికి ఎందుకు వెళ్లావని రూ.5వేల జరిమానా చెల్లించాలని, అప్పటివరకు కుల బహిష్కరణ చేస్తున్నట్లు తెలిపాడు. ఈ ఘటన 2015లో చోటుచేసుకుంది. బాధితుడు రెండేళ్ల పాటు కులానికి దూరంగా ఉన్నాడు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అసిస్టెంట్ పీపీ నవీన్ 10మంది సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.



భేటింగ్ అవుతున్న మహిళలు



రావుడ్ దేవతలకు మొక్కుతున్న భక్తులు

అమ్మా.. ఇక వెళ్లొస్తాం..

- ముగిసిన 'జంగుబాయి'జాతర
- తిరుగుపయనమైన ఆదివాసీలు
- 363 మేళలు, 2.61 లక్షల భక్తుల దర్శనం
- నెల రోజులపాటు కిటకిటలాడిన పుణ్యక్షేత్రం

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల దైవక్షేత్రం, ఆరాధ్యదైవం జంగుబాయి జాతర ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పుష్యమాసం రోజున ప్రారంభమై నెలరోజుల పాటు ఉత్సవాలు కనుల పండుగగా జరిగాయి. భక్తులు మర్రిచెట్టు, పోచమ్మ, రావుడ్, మైసమ్మ, జంగుబాయికి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 363 మేళలు, 2.61 లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కొడప జాకు, మరప జాబీరావు తెలిపారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాతో పాటు ఆరు రాష్ట్రాలకు చెందిన ఆదివాసీలు అమ్మవారిని దర్శించుకున్నారు. మళ్లీ ఈ జాతర మే మాసంలో నిర్వహించనున్నారు.

గంగాజలంతో శుద్ధి

కపిల్కె సిద్ధికస, దారికస, విజ్జకస, టొప్లకస ప్రాంతాల్లోని పవిత్ర నదుల్లో నుంచి గంగాజలం తీసువచ్చి శుక్రవారం ఉదయం దేవతా విగ్రహాలను శుద్ధి చేశారు. సాయంత్రం కేస్లాపూర్‌లోని నాగోబా దేవతతో భేటీకోసం జంగుబాయి తరలివెళ్లనుండడంతో ఉదయాన్నే కార్యక్రమాలు పూర్తి చేశారు.